## హైదరాబాద్ నుంచి సింగపూర్, కొలంబోలకు..

### డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించనున్న ఇండిగో

హైదరాబాద్, అక్టోబర్ 27:హైదరాబాద్ విమానాశ్రయం మరో రెండు అంతర్జాతీయ రూట్లలో విమాన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ నుంచి సింగపూర్, కొలంబోలకు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నట్టు ఇండిగో శుక్రవారం ప్రకటించింది. రాష్ట్రం నుంచి సింగపూర్, కొలంబోలను సందర్శించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం వల్లనే ఈ నూతన సర్వీసులను అందుబాటులోకి తీసుకోస్తున్నట్టు తెలిపింది. వీటిలో హైదరాబాద్-సింగపూర్‌ల మధ్య సర్వీసులు ఈ నెల 29 నుంచి అందుబాటులోకి రానున్నది. హైదరాబాద్ నుంచి అర్ధరాత్రి 2.50 గంటలకు బయలుదేరనున్న 6ఈ-1027 విమాన సర్వీసు సింగపూర్‌కు ఉదయం 10 గంటలకు(సింగపూర్ కాలమాన ప్రకారం) చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో సింగపూర్‌లో రాత్రి 23.25 గంటలకు(సింగపూర్ కాలమాన ప్రకారం) బయలుదేరి హైదరాబాద్‌కు అర్ధరాత్రి 1.30 గంటలకు చేరుకోనున్నది. అలాగే వచ్చే నెల 3 నుంచి హైదరాబాద్-కొలంబోల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసు అందుబాటులోకి రానున్నది. 6ఈ-1181 నంబర్ కలిగిన ఇండిగో విమాన సర్వీసు హైదరాబాద్ నుంచి ఉదయం 11.50 గంటలకు బయలుదేరి కొలంబోకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో కొలంబోలో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు సాయంత్రం 5 గంటలకు చేరుకోనున్నది. ఈ నాన్-స్టాప్ ఫ్లైట్ సర్వీసు వారానికి నాలుగు రోజులు సోమ, మంగళ, శుక్ర, ఆదివారాల్లో మాత్రమే ఉంటుందని తెలిపింది.



# ఫారెక్స్ రిజర్వులు మళ్లీ డౌన్

### వారం రోజుల్లో 2.36 బిలియన్ డాలర్లు పతనం

### ఈ నెల 20 నాటికి 583.5 బిలియన్ డాలర్లకే పరిమితం

ముంబై, అక్టోబర్ 27: దేశీయ ఫారెక్స్ రిజర్వులు మళ్లీ క్షీణించాయి. వరుసగా నెల రోజులకుపైగా పడిపోయిన భారతీయ విదేశీ మారకపు నిల్వలు.. ఒక్క వారం పెరిగినట్టే పెరిగి తిరిగి పతనం బాటే పట్టాయి. ఈ నెల 20తో ముగిసిన వారంలో 2.36 బిలియన్ డాలర్లు దిగజారినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం తెలిపిన గణాంకాల్లో తేలింది. దీంతో అక్టోబర్ 20 నాటికి దేశంలో గల ఫారెక్స్ నిల్వలు 583.53 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అంతకుముందు అక్టోబర్ 6 నుంచి 13 మధ్య 1.153 బిలియన్ డాలర్లు పెరిగాయి. అయితే మరుసటి వారమైన అక్టోబర్ 13 నుంచి 20 మధ్య అంతకు రెట్టింపు స్థాయిలో కరిగిపోయాయి. దీంతో గత నెల 1 నుంచి ఈ నెల 20 వరకు 15 బిలియన్ డాలర్లకుపైగానే దేశీయ ఫారెక్స్ నిల్వలు క్షీణించినట్టైంది.

**తగ్గితే కష్టాలే**

దేశంలోని ఫారెక్స్ రిజర్వులు ఇంకా పడిపోతే ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమేనంటున్నారు మెజారిటీ ఎకానమీ ఎక్స్‌పర్ట్స్. విదేశీ మారకపు నిల్వలు బలంగా ఉంటే దేశానికి ఎంత లాభమో.. బలహీనపడితే కూడా అంతే ఇబ్బందులుంటాయని గుర్తుచేస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సైతం తీసికట్టుగా ఉన్న ప్రస్తుత తరుణంలో దేశంలో డాలర్ నిల్వలు క్షీణించడం ఆమోదయోగ్యం కాదని చెప్తున్నారు. ముడి చమురు దిగుమతులు భారమవుతాయని, ఇదే జరిగితే ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, ఆర్బీఐ వడ్డీరేట్లు పెరిగి, రుణ లభ్యత తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా దేశ జీడీపీ వృద్ధికి సవాల్ విసిరేవే మరి.

**దృష్టి పెట్టకపోతే..**

ఫారెక్స్ నిల్వల పతనంపై ఆర్బీఐతోపాటు కేంద్రం దృష్టి సారించాలని, లేకపోతే మాంద్యం బారినపడటం ఖాయమని ఇప్పుడు నిపుణులు హితవు పలుకుతున్నారు. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, గాజాపై ఇజ్రాయెల్ దాడుల మధ్య అప్రమత్తత చాలా అవసరమని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలోనే తగిన చర్యలు తీసుకోకపోతే కోలుకోలేని దెబ్బ ఖాయమేనంటున్నారు.

- భారత ఫారెక్స్ రిజర్వుల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఈ నెల 13 నుంచి 20 మధ్య 4.15 బిలియన్ డాలర్లు దిగి 515.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి.
- బంగారం నిల్వలు మాత్రం ఈ వారం రోజుల్లో 1.85 బిలియన్ డాలర్లు ఎగిసి 45.42 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్‌లు) 70 మిలియన్ డాలర్లు క్షీణించి 17.93 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.
- ఇక అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతీయ రిజర్వ్ స్థాయి 6 మిలియన్ డాలర్లు పుంజుకొని 4.98 బిలియన్ డాలర్లను తాకింది.
- సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 20 వరకు 15.354 బిలియన్ డాలర్లు ఆవిరైపోయిన దేశీయ ఫారెక్స్ నిల్వలు



**ఫారెక్స్ నిల్వల తీరుతెన్నులు ఇలా.. (డాలర్లలో)**

| తేదీల మధ్య | క్షీణత (బిలియన్లు) |
|---|---|
| సెప్టెంబర్ 1-8 | 4.99 |
| సెప్టెంబర్ 8-15 | 867 |
| సెప్టెంబర్ 15-22 | 2.33 |
| సెప్టెంబర్ 22-29 | 3.79 |
| సెప్టెంబర్ 29 అక్టోబర్ 6 | 2.17 |

## ఆకట్టుకున్న రెడ్డీస్ ల్యాబ్




హైదరాబాద్, అక్టోబర్ 27: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.1,482.2 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది డాక్టర్ రెడ్డీస్. అమెరికాలో జనరిక్ ఔషధాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే లాభంలో 33.02 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఏడాది క్రితం సంస్థ రూ.1,114.2 కోట్ల లాభాన్ని గడించింది. సమీక్షకాలంలో కంపెనీ మొత్తం ఆదాయం ఏడాది ప్రాతిపదికన 13.25 శాతం ఎగబాకి రూ.7,217.6 కోట్లకు ఎగబాకింది. కంపెనీ నిర్వహణ ఖర్చులు 11.14 శాతం పెరిగి రూ.5,305.1 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా కంపెనీ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..అమెరికాలో జనరిక్ వ్యాపారం అంచనాలకుమించి రాణించడంతోపాటు యూరప్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకోవడం వల్లనే విక్రయాలు, అటు లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందన్నారు. అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను విక్రయించడంతో రూ.6,113 కోట్ల ఆదాయం సమకూరింది.

## స్మార్ట్ బజార్ ప్రచారకర్తగా మాధురి దీక్షిత్

హైదరాబాద్, అక్టోబర్ 27: స్మార్ట్ బజార్ ప్రచారకర్తగా బాలీవుడ్ నటి మాధురి దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో స్మార్ట్ బజార్‌కు మరింత ప్రచారం కల్పించడానికి మాధురి దీక్షిత్ నటించిన ప్రకటనను విడుదల చేసింది. ఈ సీజన్‌లో కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో అన్ని రకాల ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయిస్తున్నది. రూ.1,999 షాపింగ్ చేసిన వారికి రూ.9కే కిలో చక్కెరను అందిస్తున్నది. వీటితోపాటు స్వీట్స్, డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ప్యాక్‌లను తగ్గింపు ధరకే విక్రయిస్తున్నది.




# రిలయన్స్ లాభం 17,394 కోట్లు

- ఆదాయం రూ.2.55 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) కన్సాలిడేటెడ్ నికరలాభం 2023 సెప్టెంబర్ త్రైమాసికంలో 27 శాతం వృద్ధిచెంది రూ.17,394 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.25.71) చేరింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.13,656 కోట్ల నికరలాభాన్ని (షేరుకు రూ.19.92)ఆర్జించింది. ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో కనపర్చిన రూ.16,011 కోట్ల కంటే తాజాగా ముగిసిన మూడు నెలల్లో అధిక లాభాన్ని సంపాదించింది. అయితే కంపెనీ ఆదాయం దాదాపు ఫ్లాట్‌గా రూ.2.55 లక్షల కోట్లుగా నమోదయ్యింది. శుక్రవారం సమావేశమైన డైరెక్టర్ల బోర్డు ఆర్థిక ఫలితాల్ని పరిగణనలోకి తీసుకున్నట్టు కంపెనీ తెలిపింది. ఇంధనాలకు, పెట్రోకెమికల్స్‌కు డిమాండ్ పటిష్టంగా ఉండటం, విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తగ్గించడంతో తమ ఆయిల్-టు-కెమికల్స్ (ఓ2సీ) వ్యాపారం మెరుగుపడిందని ఆర్ఐఎల్ వివరించింది. నిర్వహణాపరంగా చూస్తే కంపెనీ ఇబిటా 30 శాతం అధికమై రూ.44,867 కోట్లకు చేరింది. ఓ2సీ ఇబిటా భారీగా 36 శాతం పెరిగి రూ.16,281 కోట్లకు పెరిగింది.

**రూ.2.95 లక్షల కోట్లకు తగ్గిన రుణం**

జూన్ త్రైమాసికంలో రూ.3.18 లక్షల కోట్లుగా ఉన్న ఆర్ఐఎల్ రుణం సెప్టెంబర్ చివరినాటికి రూ.2.95 కోట్లకు తగ్గింది. అధిక వడ్డీ రేట్ల కారణంగా వడ్డీ వ్యయాలు సెప్టెంబర్ త్రైమాసికంలో 26 శాతం పెరిగి రూ. 5,731 కోట్లకు చేరాయి. తరుగుదల కేటాయింపులు 30 శాతం వృద్ధితో రూ.12,585 కోట్లకు పెరిగాయి.

**రిటైల్ లాభంలో 21 శాతం వృద్ధి**

ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ నికరలాభం 21 శాతం వృద్ధి చెంది రూ.2,790 కోట్లకు చేరగా, ఆదాయం 19.48 శాతం పెరిగి రూ.68,937 కోట్ల వద్ద నిలిచింది. కొత్త స్టోర్లు ప్రారంభించడం, సందర్శకులు పెరగడం, అన్ని ఉత్పత్తులకూ వినియోగం వృద్ధిచెందడంతో మంచి ఫలితాల్ని సాధించామని రిలయన్స్ తెలిపింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో 471 కొత్త స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,650కి చేరింది. సందర్శకుల సంఖ్య 40 శాతం వృద్ధితో 26 కోట్లకు పెరిగిందని కంపెనీ వెల్లడించింది.

**జియో లాభం రూ. 5,058 కోట్లు**

టెలికం కంపెనీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ నికరలాభం సెప్టెంబర్ త్రైమాసికంలో 12 శాతం పెరిగి రూ. 5,058 కోట్లకు చేరింది. ఆదాయం 9.8 శాతం పెరిగి రూ. 24,750 కోట్లకు పెరిగింది. తమ ఏవరేజ్ రెవిన్యూ పర్ యూజర్ (ఏపీఆర్‌యూ) 2.5 శాతం పెరిగి రూ.181.7కి చేరినట్టు రిలయన్స్ జియో మాతృసంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ తెలిపింది. చందాదారుల సంఖ్య 7.5 శాతం వృద్ధిచెంది 45.97 కోట్లకు చేరిందన్నది. తాము జూలైలో విడుదల చేసిన జియోభారత్ ఫోన్ కొద్ది నెలల్లోనే మంచి మార్కెట్ వాటాను సాధించిందని పేర్కొంది. దేశవ్యాప్తంగా 8,000 నగరాలు, పట్టణాల వ్యాప్తంగా 10 లక్షల 5జీ సెల్స్‌ను అమర్చినట్టు తెలిపింది. లక్షలాది గృహాలకు జియో ఎయిర్‌ఫైబర్ ద్వారా హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించామన్నది.

*'అన్ని వ్యాపార విభాగాలూ పటిష్టమైన పనితీరును కనపర్చడంతో రిలయన్స్ మరో త్రైమాసికంలో వృద్ధి జోరును కొనసాగించింది. ఇంధన మార్కెట్లలో ఒడిదుడుకులున్నా, ఓ2సీ విభాగం ప్రత్యేకించి ఆయిల్, గ్యాస్ వ్యాపారం వృద్ధి సాధించింది. డిజిటల్ ఇండియా విజన్‌కు కట్టుబడి రెండు వినూత్న సాధనాలు.. జియోఎయిర్‌ఫైబర్, జియోభారత్ ఫోన్‌అను అందిస్తున్నాం. 2023 డిసెంబర్‌కల్లా దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణను పూర్తి చేస్తాం. రిలయన్స్ రిటైల్ విస్తృత శ్రేణి ఉత్పత్తులతో తన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ఉనికిని శరవేగంగా విస్తరిస్తుంది'*

*-ముకేశ్ అంబానీ, సీఎండీ, ఆర్ఐఎల్*



## బీవోబీ జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా తాజాగా 'బీవోబీ లైట్ సేవింగ్స్ అకౌంట్' పేరుతో లైఫ్‌టైమ్ జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ ఖాతా సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. పండుగ సీజన్ సందర్భంగా ఈ ఆఫర్ తీసుకొచ్చామని, ఎటువంటి కనీస నిల్వ లేకుండా ఖాతాదారులు బ్యాంకింగ్ సేవల్ని పొందవచ్చని బీవోబీ తెలిపింది. ఇతర ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా బీవోబీ లైట్ అకౌంట్‌లో నామమాత్రపు త్రైమాసిక సగటు నిల్వను కొనసాగిస్తే ఉచిత రూపే ప్లాటినం డెబిట్ కార్డు, అర్హులైన వారికి జీవితకాలపు ఉచిత క్రెడిట్ కార్డు ఆఫర్ చేస్తున్నట్టు బ్యాంక్ వివరించింది. ఇందుకోసం త్రైమాసికపు కనీస నిల్వ మెట్రో/అర్బన్ శాఖల్లో రూ.3,000, సెమీఅర్బన్ శాఖల్లో రూ.2,000, గ్రామీణ శాఖల్లో రూ.1,000 ఉండాలి.

### 12న మూరత్ ట్రేడింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: దీపావళి పండుగ సందర్భంగా వచ్చే నెల 12న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో మూరత్ ట్రేడింగ్ గంటపాటు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 7.15 గంటల వరకు గంట పదిహేను నిమిషాల పాటు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ నిర్వహించనున్నారు.

### 21న ఫ్యూచర్ టెక్ లెన్స్ సదస్సు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): భవిష్యత్తును శాసించే టెక్నాలజీని ప్రపంచానికి పరిచయం చేసేలా హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు జరగబోతున్నది. వచ్చే నెల 21 నుంచి హెచ్ఐసీసీ వేదికగా నాస్కాం..ఫ్యూచర్ టెక్ లెన్స్-2023 సదస్సును నిర్వహించబోతున్నది. టెక్నాలజీ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, ఆయా రంగాలపై వాటి ప్రభావంపై చర్చించేందుకు నిపుణులంతా ఒకే వేదికపైకి రాబోతున్నారు. కృత్రిమ మేధస్సు, స్పేస్ టెక్, ఫిన్ టెక్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కీలకమైన అంశాలపై చర్చించనున్నారు.

### మారుతి లాభం ఆకర్షణీయం

ముంబై, అక్టోబర్ 27: మారుతి సుజుకీ ఆర్థిక ఫలితాల్లో అంచనాలకు మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,716.5 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,061.54 కోట్ల లాభం కంటే 80.3 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌లో వాహనాలు అమ్మకాలు పుంజుకోవడం, కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడం, అదనపు ఖర్చులు తగ్గించుకోవడం, ఆపరేటింగేతర ఆదాయం పెరగడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.28,543.50 కోట్లుగా నమోదైన కంపెనీ విక్రయాలు గత త్రైమాసికానికిగాను రూ.35,535.1 కోట్లకు చేరుకున్నాయి. గత త్రైమాసికంలో సంస్థ 5,52,055 కార్లను దేశీయంగా విక్రయించింది.

# హమ్మయ్య.. పెరిగాయి

### వరుస నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 635, నిఫ్టీ 202 పాయింట్లు వృద్ధి

### ఆకట్టుకున్న ఆటో, ఐటీ, ఆర్థిక రంగాల షేర్లు

### లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై, అక్టోబర్ 27: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాలను అందుకున్నాయి. వరుసగా 6 రోజులపాటు నష్టాల్లోనే కొట్టుమిట్టాడిన సూచీలు.. శుక్రవారం తిరిగి కోలుకున్నాయి. 1 శాతానికిపైగా పుంజుకోవడం గమనార్హం. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 634.65 పాయింట్లు లేదా 1.01 శాతం ఎగిసి 63,782.80 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 63,913.13 స్థాయిని తాకింది. గత 6 రోజుల్లో సెన్సెక్స్ 3,279.94 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 202.45 పాయింట్లు లేదా 1.07 శాతం ఎగబాకి 19,059.70 వద్ద స్థిరపడింది.

**పెట్టుబడులకు పెద్దపీట**

గత 6 రోజులుగా లాభాల స్వీకరణకే ప్రాధాన్యతనిచ్చిన మదుపరులు.. మళ్లీ పెట్టుబడులకు పెద్దపీట వేశారు. ఆటో, ఐటీ, ఆర్థిక, ఎనర్జీ రంగాల షేర్లు ఆకట్టుకోవడంతో భారీగా కొనుగోళ్లు చోటుచేసుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్ లేదా క్యూ2)గాను ఆయా కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక ఫలితాల్ని అంచనాలకు మించి ప్రకటించడం కూడా కలిసొచ్చిందని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. మారుతీ, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ ఫలితాలు బాగున్నాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మిడిల్ ఈస్ట్ ఆందోళనల్నీ మదుపరులు పక్కనబెట్టి ఇన్వెస్టింగ్‌కే ఆసక్తి కనబర్చారని చెప్తున్నారు. అయితే అమెరికా జూలై-సెప్టెంబర్ జీడీపీ గణాంకాలు రెండేండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 4.9 శాతంగా నమోదు కావడం కొంత కలిసొచ్చిందని అంటున్నారు. నిజానికి 4.2 శాతంగానే అంచనాలున్నాయని గుర్తుచేస్తున్నారు.

**రంగాల వారీగా..**

యుటిలిటీ షేర్లు 2.22 శాతం, పవర్ 2.04 శాతం, సర్వీసెస్ 1.79 శాతం, ఇండస్ట్రియల్ 1.63 శాతం, రియల్టీ 1.63 శాతం, ఐటీ 1.36 శాతం చొప్పున లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్ షేర్ విలువ అత్యధికంగా 3.07 శాతం పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్, ఎస్బీఐ, ఎన్టీపీసీ, టాటా మోటర్స్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్ షేర్లూ లాభపడ్డాయి. ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ 1.75 శాతం పుంజుకొని రూ.2,265.25 వద్ద స్థిరపడింది.

**మార్కెట్ లాభాలకు 5 ప్రధాన కారణాలు**

- అంచనాలకు మించి నమోదైన క్యూ2 ఆర్థిక ఫలితాలు
- కొనుగోళ్ల జోష్‌లో మదుపరులు
- ఆటో, ఐటీ, ఆర్థిక, ఎనర్జీ రంగాల షేర్లు ఆకర్షణీయం
- మెరుగైన అమెరికా జీడీపీ గణాంకాలు
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు

**గ్లోబల్ మార్కెట్లలో..**

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు సైతం దేశీయంగా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, చైనా, జపాన్, హాంకాంగ్ సూచీలు ఆకర్షణీయ లాభాలనే అందుకున్నాయి. అయితే ఐరోపా మార్కెట్లలో మాత్రం మిశ్రమ స్పందన కనిపించింది. బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు నష్టాల్లో, జర్మనీ లాభాల్లో ఉన్నాయి. గురువారం అమెరికా స్టాక్ మార్కెట్ నష్టపోయింది. కాగా, గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నా.. మదుపరులు దానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే మార్కెట్లు లాభపడ్డాయని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. ఎఫ్ఐఐలు శుక్రవారం రూ.1,500.13 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు ఎక్స్చేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

**రూ.4.41 లక్షల కోట్లు..**

దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రావడంతో మదుపరుల సంపద కూడా పెరిగింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.41 లక్షల కోట్లకుపైగా పుంజుకున్నది. రూ.4,41,152.35 కోట్లు ఎగబాకి రూ.3,10,45,955.07 కోట్లకు చేరింది. గురువారం మార్కెట్లు ముగిసే సమయానికి రూ.3,06,04,802.72 కోట్లుగా ఉన్నది. అంతకుముందు 6 రోజుల్లో మదుపరుల సంపద ఏకంగా రూ.17.77 లక్షల కోట్లు ఆవిరైపోయిన విషయం తెలిసిందే. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.70 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.89 శాతం పెరిగాయి. కార్పొరేట్ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలు మదుపరుల్లో తిరిగి ఉత్సాహాన్ని నింపాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు.



## నయా శాటిలైట్ నెట్‌వర్క్‌లు

### ఐఎంసీలో జియోస్పేస్‌ఫైబర్.. ఎయిర్‌టెల్ వన్‌వెబ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2023లో రిలయన్స్ జియో.. భారతీ ఎయిర్‌టెల్ తమ శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థలను ప్రదర్శించాయి. దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణలో ఇరు సంస్థలు పోటీపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే శుక్రవారం ఇక్కడ మొదలైన ఐఎంసీలో అటు రిలయన్స్ జియో తమ జియోస్పేస్‌ఫైబర్, ఇటు భారతీ ఎయిర్‌టెల్ తమ వన్‌వెబ్ విశేషాలు, సన్నద్ధతల్ని తెలియపర్చాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని దేశంలోని మారుమూల ప్రాంతాలకూ హై-స్పీడ్ బ్రాడ్‌బాండ్ సర్వీసులను సరసమైన ధరలకే అందించేందుకు జియోస్పేస్‌ఫైబర్‌ను విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. తమ టెక్నాలజీతో భారత్.. ప్రపంచ బ్రాడ్‌బాండ్ రాజధానిగా అవతరిస్తుందన్న విశ్వాసాన్ని కనబర్చారు. ప్రస్తుతం హై-స్పీడ్ బ్రాడ్‌బాండ్ ఫిక్స్‌డ్ లైన్, వైర్‌లెస్ సర్వీసులను 45 కోట్ల భారతీయ వినియోగదారులకు జియో అందిస్తున్నదన్నారు. ఇక వచ్చే నెల నుంచి దేశంలోని అన్ని చోట్లా వన్‌వెబ్ శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీస్ అందుబాటులో ఉంటుందని భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ తెలిపారు. దేశంలో గత ఏడాది 5జీ సర్వీసులను ప్రారంభించామని, ఇప్పటిదాకా 5వేల నగరాలు, పట్టణాలతోపాటు 20వేల గ్రామాలకు విస్తరించామని చెప్పారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్‌ను అందించేందుకే వన్‌వెబ్‌ను తెచ్చామని వివరించారు.

**వొడాఐడియా విస్తరణ..**

దేశంలో 4జీ నెట్‌వర్క్ బలోపేతానికి, 5జీ సేవల విస్తరణకు భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార మంగళం బిర్లా ప్రకటించారు. భారత్.. ఓ టెలికం టెక్నాలజీ డెవలపర్‌గా ఎదుగుతున్నదని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. డిజిటలైజేషన్‌కు ముఖద్వారం టెలికం రంగమేనన్నారు. 5జీ సేవల విస్తరణ వేగంగా జరుగుతున్నదని, ఇక భారత్.. 6జీ దిశగా అడుగులేస్తోందని చెప్పారు.

## మారుట్ డ్రోన్ నూతన ఆఫీస్




హైదరాబాద్, అక్టోబర్ 27: మారుట్ డ్రోన్..హైదరాబాద్‌లో నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని ప్రారంభించింది. 9 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం నుంచి ఉత్పత్తి, టెక్నాలజీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్అండ్‌డీ) సంబంధించిన అన్ని రకాల సేవలు అందించనున్నట్టు కంపెనీ సీఈవో, ఫౌండర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. దేశీయంగా పది రాష్ర్టాల్లో 100 డీలర్లు ఉండగా..2028 నాటికి ఈ సంఖ్యను 500కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది. అలాగే ఉద్యోగుల సంఖ్యను 80 నుంచి 200కి పెంచుకోనున్నట్టు ప్రకటించింది. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ర్టాల్లో సర్వీస్ సెంటర్‌ను సైతం నెలకొల్పనున్నట్టు ఆయన ప్రకటించారు.

## యూనియన్ బ్యాంక్ అదుర్స్

హైదరాబాద్, అక్టోబర్ 27: ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం రెండు రెట్లు పెరిగింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,511 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,848 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రెండు రెట్లు పెరిగింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం పుంజుకోవడం ఇందుకు కారణమని విశ్లేషించింది. ఏడాది క్రితం రూ.22,958 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.28,282 కోట్లకు ఎగబాకింది. గత త్రైమాసికంలో వడ్డీల ద్వారా రూ.24,587 కోట్లు సమకూరాయి. వీటిలో నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9.89 శాతం ఎగబాకి రూ.9,126 కోట్లకు చేరుకున్నాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 8.45 శాతం నుంచి 6.38 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ కూడా 2.64 శాతం నుంచి 1.30 శాతానికి దిగాయి.

## టాటాల చేతికి ఐఫోన్ తయారీ కంపెనీ

### రూ.1,000 కోట్లకు విస్ట్రాన్ యూనిట్ కొనుగోలు




న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ఐఫోన్లు తయారు చేసే తొలి భారతీయ సంస్థగా టాటా గ్రూప్ ఆవిర్భవించనుంది. ఇప్పటివరకూ దేశంలో యాపిల్ ఫోన్లను విదేశీ కంపెనీల సబ్సిడరీలు ఉత్పత్తి చేస్తుండగా, అందులో ఒకటైన విస్ట్రాన్ యూనిట్‌ను టాటా గ్రూప్ రూ.1,000 కోట్లకు కొంటున్నది. టాటాలకు యూనిట్‌ను విక్రయించాలన్న ప్రతిపాదనను విస్ట్రాన్ బోర్డు ఆమోదించింది. ఈ మేరకు విస్ట్రాన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటాను టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి తమ సబ్సిడరీలైన ఎస్ఎంఎస్ ఇన్ఫోకామ్ సింగపూర్, విస్ట్రాన్ హాంకాంగ్‌లు షేర్ పర్చేజ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేయనున్నట్టు విస్ట్రాన్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. ఇరు పక్షాలు సంతకాలు చేసిన తర్వాత అవసరమైన అనుమతుల్ని కోరతామని పేర్కొంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.